సాక్షి కామారెడ్డి

శనివారం । 2 । నవంబర్ । 2024



తూకాలు ప్రారంభించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వెంటనే తూకాలు ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

- 9లో ▸



ఘనంగా ఐక్యతా దినోత్సవం

దేశ మొదటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /20.8

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 7వ తేదీ వరకు 30, 30ఏ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయని ఎస్పీ సింధు శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు

కామారెడ్డి టౌన్: దీపావళి పండుగ పూట రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు శుభ వార్త తెలిపింది. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల కాస్మెటిక్స్, డైట్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 3 నుంచి ఏడో తరగతి వరకు డైట్ చార్జీలు రూ.950 ఉండగా.. దానిని రూ. 1,330 లకు పెంచింది. అలాగే 8 నుంచి పదో తరగతి వరకు డైట్ చార్జీలను రూ.1,100 నుంచి రూ. 1,540 లకు, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ. 1,500 నుంచి రూ. 2,100లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 3 నుంచి ఏడో తరగతి వరకు ప్రస్తుతం కాస్మెటిక్ చార్జీల కింద రూ.55 చెల్లిస్తుండగా దానిని రూ. 175లకు పెంచింది. 8 నుంచి పదో తరగతి వరకు కాస్మెటిక్ చార్జీలను రూ.75 నుంచి రూ. 275 లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సర్కారు నిర్ణయంతో జిల్లాలోని హాస్టల్‌లలో ఉన్న 28 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

నేటి నుంచి కార్తీక దీపోత్సవం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీవిశాలాక్షి సమేత శ్రీవిశ్వనాథస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు కార్తీక మాస ఆకాశ దీపోత్సవాన్ని ప్రారంభించనున్నారు. నెలరోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ అర్చకులు అనిరుద్ ఓ ప్రకటనలో తెలిపారు.

‘అక్రమ డిప్యుటేషన్లపై విచారణ జరపాలి’



కామారెడ్డి టౌన్: జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులకు జరిపిన అక్రమ డిప్యుటేషన్లపై విచారణ జరిపించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని చాలా మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులకు జీవో-25కు విరుద్ధంగా డిప్యుటేషన్లు కల్పించారన్నారు. తక్షణమే వీటిపైన సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.లింగం పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం 7 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంగా రాజేశ్వర్

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా అంబదాస్ రాజేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న వైపీ రమేశ్‌ను వనపర్తి జిల్లాకు బదిలీ చేశారు. రాజేశ్వర్ గతంలో బోధన్ ఆర్డీవోగా ఉండి రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్‌లో ఉన్నారు. తాజాగా నిజామాబాద్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎంగా నియమించారు.



కామారెడ్డి గాంధీ గంజ్‌లో వర్షానికి తడిసిన ధాన్యం



కోమలంచలో ధాన్యం కుప్పల చుట్టూ చేరిన నీటిని తొలగిస్తున్న రైతు

వాన గండం!



కామారెడ్డి గాంధీ గంజ్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పలు ప్రాంతాలలో వరి కోతలు ముగింపునకు వస్తున్నా.. కొనుగోళ్ల జాడ కరువయ్యింది. అంతటా ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సర్కారు.. కాంటాల మాటే ఎత్తడం లేదు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో అన్నదాత ఆగమవుతున్నాడు. వాన నుంచి పంటను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నాడు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- తుపాను ప్రభావంతో వర్షాలు
- కల్లాల్లో తడిసిముద్దవుతున్న ధాన్యం
- కొనుగోళ్లు మొదలుకాక అవస్థలు

వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న జాప్యం రైతులకు శాపంగా మారింది. వరి కోతలు మొదలై నెల రోజులైనా ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్ల విషయంలో స్పష్టత రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తుపాను ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాలలో రెండు, మూడు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసింది. కామారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లో కురిసిన భారీ వర్షంతో ధాన్యం నానిపోయింది. కొన్నిచోట్ల ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడిన తర్వాత చేతికొచ్చిన పంట వర్షార్పణం అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



గుండారంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

ధాన్యం సేకరణ ఎప్పుడో?

జిల్లాలో 3.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవగా.. 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోళ్ల కోసం అధికారులు నెల రోజులుగా సమీక్షలు, మిల్లర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే కాంటాలు మాత్రం ఇప్పటికీ మొదలుకాలేదు. ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య వివిధ అంశాలపై అవగాహన కుదరకపోవడం వల్లే ధాన్యం సేకరణలో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నిబంధనల ప్రకారం మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతుండగా.. దానికి మిల్లర్లు ఒప్పుకోవడం లేదు. దీంతో కాంటాలు మొదలుకాలేదు. అయితే అధికారులు మాత్రం కొనుగోళ్లు చేపడతామని చెబుతున్నారు. కాంటాలు మొదలుపెట్టిన తర్వాత మిల్లర్లు ధాన్యం బస్తాలు దించుకోకపోతే పరిస్థితి ఏమిటన్న దానిపై అయోమయ పరిస్థితి నెలకొంది.



గోపాల్‌పేటలో వడ్లను కుప్ప చేస్తున్న రైతులు



గోపాల్‌పేట కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లు

వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం, వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ముందుగా వరి కోసిన రైతులు ధాన్యాన్ని దళారులు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. వ్యాపారులు యాంత్రాలతో కోసి కుప్పపోసిన వడ్లను ఉన్నది ఉన్నట్టుగా కొనుగోలు చేస్తున్నారు. నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ ప్రాంతంలో ఇప్పటికే చాలా మంది రైతులు వడ్లను అమ్ముకున్నట్లు తెలుస్తోంది. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లోనూ రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎదురుచూస్తున్న రైతులు.. నిల్వ చేసేందుకు స్థలం లేక ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి కుప్పలుగా పోశారు. మరికొందరు కల్లాల్లో, రోడ్ల పక్కన ఉంచారు. కొందరు వడ్లను ఆరబెడుతుండగా, మరికొందరు కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పి ఉంచారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. కష్టపడి పండించిన పంట వర్షానికి నానిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంటాలు మొదలుపెట్టాలని రైతులు కోరుతున్నారు.



పర్మళ్లలో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

కులగణనతో జనంలోకి..

- విస్తృత ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అడుగులు
- నేడు జిల్లా కేంద్రంలో సమావేశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేలో ప్రధానంగా కుల గణన అంశాన్ని జనంలోకి తీసుకువెళ్లేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో వివిధ కుల, విద్యార్థి, యువజన సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు చెందిన పార్టీ అన్ని విభాగాలతో పాటు కుల సంఘాల నేతలు సమావేశానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులందరూ పాల్గొననున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ కుల గణన చేస్తామన్న హామీని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై కసరత్తు మొదలుపెట్టింది. కుల గణనతో పాటే కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్లతో సర్వే కొనసాగనుంది. సర్వేలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనేలా ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. కుల గణన ద్వారా ఆయా కులాల వారికి కలిగే ప్రయోజనాలను ఈ సమావేశంలో వివరించనున్నారు.

పాల్గొననున్న షబ్బీర్ అలీ

కుల గణన అంశంపై బీసీ కమిషన్ సభ్యులు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. వారు కులసంఘాల నేతలనుంచి అభిప్రాయాలను సేకరించారు. తాజాగా పార్టీ పరంగా జనంలోకి వెళ్లేందుకు కాంగ్రెస్ నాయకత్వం పావులు కదుపుతోంది. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీతో పాటు జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొననున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే పార్టీలో నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరవుతారా లేదా అన్న దానిపై కాంగ్రెస్‌లో చర్చ సాగుతోంది.



ఘనంగా దీపావళి

మద్నూర్‌లో దీపావళి సంబురాల్లో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

జిల్లాలో గురువారం దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఇళ్లు, దుకాణాలను ముగ్గులు, దీపాలతో అందంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మి పూజలు నిర్వహించారు. అనంతరం టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. – ఫొటోలు 9లో..

కేసులను వేగంగా విచారించాలి

- పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలి
- ఎస్పీ సింధు శర్మ



సిబ్బందికి ప్రశంస పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్‌లలో నమోదవుతున్న కేసుల విచారణ వేగంగా జరగాలని ఎస్పీ సింధుశర్మ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయా పీఎస్‌లలో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల విచారణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో డబ్బులు కోల్పోయినవారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. తరచుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో రెండు వారాల స్టేషన్ రైటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది మహిళా అధికారులకు ప్రశంస పత్రాలను అందించారు. సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర రావు, సత్యనారాయణ, సీఐలు జార్జ్, డీసీఆర్‌బీ మురళి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 42 పేకాట కేసులు నమోదు

- 309 మంది అరెస్ట్
- రూ. 7.79 లక్షలు స్వాధీనం

కామారెడ్డి క్రైం: దీపావళి పండుగ అంటే దీపకాంతులు, లక్ష్మి పూజలు, టపాసుల మోతలతోపాటు జిల్లాలో పేకాట సంబురం కూడా.. ఈ పండుగ వచ్చిందంటే చాలు కొందరు పేకాటలో మునిగిపోతుంటారు. చట్టరీత్యా నేరమని, పేకాడ వద్దని పోలీసులు ఎంతగా వారిస్తున్నా ఈ ఆటకు అడ్డుకట్ట పడడం లేదు. ఏటా దీపావళి రోజున కోట్లాది రూపాయలు చేతులు మారుతూనే ఉన్నాయి. పేకాటను అడ్డుకోవడానికి పోలీసు శాఖ కూడా గట్టిగానే నిఘా పెడుతోంది. దీపావళి నేపథ్యంలో జిల్లాలోని పలు పేకాట స్థావరాలపై మూడు రోజులుగా దాడులు చేస్తున్నామని ఎస్పీ సింధుశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 42 కేసులు నమోదు చేశామని, ఆయా కేసుల్లో పేకాడుతున్న 309 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 7.79 లక్షల నగదుతోపాటు 146 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే కామారెడ్డి టాస్క్‌ఫోర్స్ అధికారులకు 87126 86109, 87126 86133 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ • ఇంటింటి సర్వే పరిశీలన

కామారెడ్డి క్రైం: ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పట్టణంలోని వాసవి హైస్కూల్ సమీపంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి సమాచారాన్ని సేకరించాలన్నారు. సమాచారాన్ని సేకరించిన అనంతరం ఆ ఇంటి గోడపై స్టిక్కర్ అంటికించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

పోసానిపేటలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



రామారెడ్డి : పోసానిపేటలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలికల విభాగంలో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు. పోసానిపేట గ్రామస్తులు , వీడీసీ సహకారంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌కి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మండలంలోని పలు పాఠశాలకు అందజేశారు. శ్రీనివాసరెడ్డి భాస్కర్ రెడ్డి రాజయ్య పాల్గొన్నారు.

వయసు చిన్నది.. మనసు పెద్దది



భిక్కనూరు: తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు ఇచ్చిన డబ్బులను తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న చిన్నారి(కాచాపూర్ గ్రామం) మర్రి అద్వైత శుక్రవారం ఆ డబ్బులను అనాథ ఆశ్రమానికి అందజేసి పెద్ద మనసు చాటుకుంది. అద్వైత తన పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉన్న స్ట్రీట్ హోమ్ అనాథ ఆశ్రమానికి తల్లిదండ్రులు మర్రి స్రవంతి, మర్రి మైపాల్‌లతో కలిసి వెళ్లి రూ. 8 వేల నగదు అందజేశారు. అలాగే వారి మధ్య పుట్టిన రోజు జరుపుకుని పండ్లు, పుస్తకాలు, పెన్నులు అందించి భోజనాన్ని పెట్టారు.

ఘనంగా ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవం

కామారెడ్డి టౌన్: ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, హమాలీ, మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి, మున్సిపల్ కార్యాలయం, సివిల్ సప్లయ్ గోదాం వద్ద జెండాను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథ్, నాయకులు బాలరాజు, రఫిక్, లక్ష్మీ, జమున, శ్రీనివాస్, సంపత్, కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

23 తులాల బంగారం చోరీ



ఖలీల్ వాడి: నిజామాబాద్ నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూ ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న సముద్రాల ఏలేశ్వర్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. దీపావళి పండగకు ఖమ్మం వెళ్లిన కుటుంబం తిరిగి వచ్చే సరికి ఇంటికి తాళం పగలగొట్టబడి ఉంది. ఇంట్లో పరిశీలించగా బీరువా పగలగొట్టి 23 తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కోమలంచ కొనుగోలు కేంద్రం వద్ద నిలిచిన వర్షపు నీరు



లింగంపేట: కొట్టుకుపోయిన ధాన్యాన్ని సేకరిస్తున్న రైతులు

అకాల వర్షం.. అన్నదాతలు ఆగమాగం

- కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయిన వైనం
- పలుచోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయిన ధాన్యం
- ఇప్పటికైనా తూకం ప్రారంభించాలని రైతుల వేడుకోలు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. సరిగ్గా ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. శుక్రవారం జిల్లాలో పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. వరద నీటి నుంచి ధాన్యం సేకరించడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో వర్షం నీరు నిల్వ ఉండడంతో వాటిని తొలగించడానికి ఇబ్బందులు పడ్డారు. ఆరుగాలం చమటోడ్చి పండించిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. వర్షం ఎప్పుడు, ఎక్కడ పడతుందో అర్థంకాక రైతులు తికమకపడుతున్నారు. పంట నూర్పిళ్లు చేసి 20 రోజులు గడిచిపోయినా నేటికీ తూకం ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ధాన్యం తూకం వేసి కల్లాల నుంచి తరలించాలని రైతులు కోరుతున్నారు.



గోపాల్‌పేటలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



పర్మళ్ల శివారులో వర్షం నీటి నుంచి ధాన్యాన్ని తీస్తున్న రైతులు



గాంధారి: ధాన్యం రాశులపై కప్పి ఉంచిన టార్పాలిన్లు



ధాన్యం రాశుల నుంచి నీళ్లు తోడేస్తూ..



కోనాపూర్‌లో తడిసిన ధాన్యం

క్రైం కార్నర్

మురికి కాలువలో పడి ఒకరి మృతి



వెంకటి (ఫైల్)

పెద్దకొడప్‌గల్: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్థానిక వైన్స్ షాప్, బ్రిడ్జి పక్కన ఉన్న మురికి కాలువలో గురువారం రాత్రి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు బోర్లం గ్రామానికి చెందిన వెంకటి(48)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య కోటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వివాహిత..

కోటగిరి: విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి చెందిన ఘటన కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందని డి లక్ష్మి (40) వృత్తిలో భాగంగా ఓ ఇంట్లో బట్టలు ఉతికి ఆరేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరు..

నవీపేట: మండల రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. ఘటన స్థలంలో మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లిలో ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. గ్రామంలోని పేరం భాను ప్రసాద్(11) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందును సేవించాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సౌదీలో తిర్మన్‌పల్లివాసి మృతి



నీల స్వామి(ఫైల్)

సదాశివనగర్: మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన నీల స్వామి(42) పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో సౌదీలో మృతి చెందినట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. బతుకుదెరువు నిమిత్తం గత పన్నెండేళ్ల నుంచి సౌదీకి వెళ్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడి వారు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ స్వామి మృతి చెందినట్లు అక్కడ ఉన్న బంధువులు కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడికి భార్య స్వప్న, కుమార్తెలు అక్షయ, ఐశ్వర్య ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తెప్పించాలని కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పీఎస్‌లో ఆత్మహత్యాయత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

బోధన్‌టౌన్: బోధన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పీఎస్‌లో బెల్లాల్ గ్రామానికి చెందిన రాజు, సవిత్రి భార్యాభర్తలు. అక్టోబర్30న వీరు సంసార విషయంలో గొడవ పడ్డారు. దీంతో భార్య సావిత్రి ఇంటి నుంచి వచ్చి పట్టణంలో నివాసం ఉంటున్న సమీప బంధువు లక్ష్మి వద్ద ఉండగా 31న రాజు బంధువు అయిన లక్ష్మి ఇంటికి వెళ్లి నా భార్యను ఎందుకు ఇంట్లో ఉంచుకున్నారంటు వారితో గొడవ పడి లక్ష్మిపై చేయి చేసుకున్నాడు. దీంతో లక్ష్మి రాజుపై ఫిర్యాదు చేసేందుకు పీఎస్‌కు చేరుకుంది. విషయం తెలుసుకున్న రాజు పోలీసులకు ఫిర్యాదు చేయొద్దంటు లక్ష్మిని కోరాడు. ఆమె వినకపోవడంతో తన వెంట తీసుకొచ్చిన పెట్రోల్‌ను రాజు తన ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు రాజును నిలువరించి సముదాయించారు. పీఎస్‌లో ఆత్మహత్యాయత్నానికి యత్నించిన రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జవాన్‌పై శానిటరీ ఎస్సై దాడి

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు ఇద్దరు ఘర్షణ పడ్డారు. పని కేటాయింపు విషయంలో పారిశుధ్య విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఘర్షణపడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. శుక్రవారం సర్కిల్–5లో పారిశుధ్య పనులు చూస్తున్న అవుట్ సోర్సింగ్ జవాన్ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు పరుషపదజాలంతో తిట్టుకున్నారు. పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ జవాన్ వెంకటస్వామిపై దాడిచేశాడు. దీంతో జవాన్ మున్సిపల్ కమిషనర్ ఎస్ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

కాకతీయ కాలువలో ఒకరి గల్లంతు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కొండూరు గంగాధర్ శుక్రవారం ప్రమాదవశాత్తు కాకతీయ కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాకతీయ కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి కొట్టుకుపోయాడు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సారెస్పీ అధికారులతో ఎస్సై నారాయణ మాట్లాడి నీటి విడుదలను నిలుపుదల చేయించి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయిన అతని జాడ లభించలేదు. శనివారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్సై తెలిపారు. గంగాధర్ గల్లంతైన విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి స్పందించి తన అనుచరుల ద్వారా రూ. 5 వేల ఆర్థికసాయం అందేలా చూశారు.

వ్యసనాలకు లోనై తండ్రి హత్య

నస్రుల్లాబాద్: చెడు వ్యసనాలకు బానిసైన కొడుకు.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని కర్రతో విపరీతంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కర్రె హనాండ్లుకు మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం కోసం తండ్రి సాయిబోయి(75) డబ్బులు అడిగేవాడు. గురువారం రాత్రి సైతం మద్యానికి డబ్బులు కావాలని తండ్రిని అడిగాడు. తండ్రి డబ్బులు లేవు అనడంతో కోపంలో అక్కడే ఉన్న కర్రతో తండ్రిపై ఇష్టారీతిన దాడి చేశాడు. దీంతో దెబ్బలకు తాళలేక తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకోండి

సబ్ కలెక్టర్ కిరణ్మయి



ఆస్పత్రిలో విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్

బాన్సువాడ: అనారోగ్యంతో బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రికి వచ్చిన పిట్లం మండలం మద్దెల్ చెరువుకు చెందిన గైని రామవ్వకు రక్త పరీక్షలు నిర్వహించకుండానే పరీక్షలు చేసినట్లు సర్టిఫికెట్ అందించడంతో కుటుంబీకులు గురువారం ఆస్పత్రిలో ఆందోళన చేశారు. బాధితురాలు విరేచనాల కారణంగా బాన్సువాడ ఆస్పత్రికి రాగా రక్త పరీక్షలు చేయకుండానే సర్టిఫికెట్ ఇచ్చారు. ఆమె కుమారుడు ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేయగా ఆస్పత్రిలో మరో రోగి పేరు కూడా రామవ్వ అని ఉండటంతో ఆమె సర్టిఫికెట్ ఈమెకు ఇవ్వడం వల్ల తప్పిదం జరిగిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇదే విషయం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టికి ఫిర్యాదు చేయగా ఆమె ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీహెచ్‌వో విజయలక్ష్మి, డాక్టర్ విజయ భాస్కర్, ఆర్ఎంవో సుజాత, సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఎల్లారెడ్డి: దీపావళి సందర్భంగా పేకాట ఆడుతున్న 14 మంది జూదరులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. బ్రాహ్మణపల్లిలో ఏడుగురి నుంచి రూ.86 వేలు స్వాధీనం చేసుకోగా.. రత్నాపూర్‌లో ఏడుగురి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గాంధారి(ఎల్లారెడ్డి): పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి 15 మందిపై కేసు నమోదు చేసి రూ.25,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రం శివారులో, చద్మల్ తండా, గొల్లాడి తండా, ముదెల్లి గ్రామాల్లో దాడులు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్ శివారులో పలువురు వ్యక్తులు పేకాడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్సై అరుణ్ కుమార్ దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.11,850 నగదు, 8 సెల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండా సమీపంలోని పాశంకుంట ఏరియాలో పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. 13 మందిని పట్టుకొని వారి నుండి రూ.9వేల నగదుతోపాటు 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఏఎస్సై ఉమేశ్ కుమార్ ఉన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంజని గ్రామ శివారులో ఆరుగురిని పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.15,400 ,కాటేపల్లి తండాలో నలుగురి వద్ద రూ.2,100 నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎవరైన పేకాట ఆడినా, ఆడించినా వారిపైన కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

నిజాంసాగర్/ బిచ్కుంద: నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, ఆరేడ్ గ్రామాల్లోని మూడు పేకాట స్థావరాలపై గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. అచ్చంపేటలోని ఓ పేకాట స్థావరంపై దాడి చేయగా 19 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 89,530 నగదు, మరో స్థావరం వద్ద 12 మందిని అదుపులోకి తీసుకోగా రూ. 7,743 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆరేడ్ గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 3 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. బిచ్కుంద మండలంలోని పెద్దడ్గి, పెద్దతక్కడ్‌పల్లి, బిచ్కుందలో పేకాటస్థావరాలపై దాడులు చేసి 31 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 42,980 నగదు, 18 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



మౌన పోరాటం చేస్తున్న భార్య, కొడుకు, కోడలు

ఎల్లారెడ్డి: వివాహమాడిన భార్యకు ఆస్తి పంపకం చేయక పోవడంతో భర్త ఇంటి ఎదుట కొడుకు, కోడలుతో కలిసి భార్య మౌన పోరాటం చేసిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమాసానిపేటకు చెందిన రిటైర్డు బ్యాంకు మేనేజర్ ప్రేమానందం 30 ఏళ్ల క్రితం సుశీలను వివాహం చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా మనస్పర్థలతో వారు దూరంగా ఉంటున్నారు. కాగా అతను వేరే మహిళతో సహజీవనం చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. సుశీలకు కొడుకు అనిల్ ఉండడంతో అతడికి ఆస్తి పంచి ఇవ్వడం లేదని దీంతో సుశీల కొడుకు అనిల్, కోడలుతో కలిసి భర్త ఇంటి ఎదుట మౌన పోరాటం చేసింది. తనకు ఆస్తి పంచి ఇవ్వాలని డిమాండ్ చేసింది. సుశీల పోరాటానికి గ్రామస్తులు సైతం మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని పీఎస్‌కు తరలించారు. సమస్యను పరిష్కరించాలని సుశీల పోలీసులను వేడుకుంది.

లింగంపల్లిలో ఒకరి హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్: మండలంలోని లింగంపల్లి శివారులోని డంపింగ్ యార్డ్ వద్ద నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల కృష్ణ(38)ను గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండ రాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటనా గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్ ఘటన స్థలానికి చేరుకుని హత్య ఘటనపై ఆరా తీశారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కరడ్‌పల్లి శివారు నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి బైక్‌పై లింగంపల్లి శివారుకు చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల ఆధారంగా తెలిసింది. ధర్మారానికి చెందిన వ్యక్తి, లింగంపల్లి శివారుకు ఎలా వచ్చాడనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మొదటగా హత్యకు గురైన వ్యక్తికి ఎడమ చేయి సిజేరియన్ వల్ల తొలగించబడి ఉందని, కుడి చేతిపై అమ్మ అని రాసి ఉన్న పుట్టుమచ్చ ఉందని, మెడలో రుద్రాక్ష ధరించి ఉన్నాడు. ఈ వివరాలతో పోలీసులు ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు వివిధ గ్రూపుల్లో షేర్ చేశారు. గురువారం సాయంత్రం వరకు మృతుడు ఎవరనే విషయంపై స్పష్టత రాలేదు. సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న నిజామాబాద్‌కు చెందిన అశోక్ హత్యకు గురైన వ్యక్తికి సంబంధించిన ఫొటోలు తన స్టేటస్‌లో పెట్టుకోవడంతో మృతుడి ఆచూకీ లభించింది. మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించారు. లింగంపల్లి శివారుకు తీసుకొచ్చి ఎందుకు హత్య చేశారనే విషయం తేలాల్సి ఉంది. డబ్బుల వ్యవహారమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీసాల పేరిట ఘరానా మోసం



రాజంపేట: విదేశాలు వెళ్లేందుకు వీసా ఇప్పిస్తానంటూ బాధితుల దగ్గర డబ్బులు తీసుకొని వారిని మోసం చేసి పరారైన నిందితుడిని పట్టుకుని జ్యుడీషియల్ కస్టడికి తరలించినట్లు ఎస్సై పుష్పరాజ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. దోమకొండ గ్రామానికి చెందిన మల్లేశం గౌడ్ రాజంపేట మండలానికి చెందిన ముగ్గురి నుంచి వీసాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ. లక్ష20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేశం పేరు మార్చు కుని పాల్వంచ కొత్తగూడెంలో ఇదే తరహా దందా చేస్తున్నట్లు సమాచారం అందడంతో రాజంపేట పోలీసులు అతన్ని పట్టుకుని గురువారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసులో నిందితుడిని చాకచక్యంగా పట్టుకోడానికి కృషి చేసిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజేశ్, రవీందర్‌లను ఎస్సై అభినందించారు.

మొరం టిప్పర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే గుట్ట ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఉన్న రెండు టిప్పర్లను సీజ్ చేసి తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. సదరు మహిళకు ఇటీవల వివాహం కావడంతో భర్తతో గొడవల కారణంగా తల్లిగారింటి వద్ద ఉంటోంది. గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సరిత తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.